కథ




# ముద్దు-మురిపాలు

వాలిహిరణ్మయీదేవి

మళ్లీ, తిరిగి ఎప్పుడు కలుసుకుంటామో అన్నట్లు ఒకరినొకరు వదలకుండా మాట్లాడేసుకుంటున్నారు ప్రాణస్నేహితులంతా.

"ఏంటే కావ్యా! అంత దిగులుగా ఉన్నావ్, మళ్లీ ఎప్పుడు కలుసుకుంటామో అనా - ఏంటో ముగ్గురమూ ఫిఫ్త్ క్లాస్ నుండీ ఫ్రెండ్సయ్యాం. ఈ డిగ్రీ అయ్యాక ఎవరి దారి ఏదవుతుందో" అంది రమణి దిగులుగా.

"నిజమే" అంది కావ్య. తన మనసులో అంతకుమించి ఉన్న బాధని దాయబోతూ.

"దీని అసలు బాధ అదికాదులే - వాళ్లపాప దీన్ని వదిలి ఎలా ఉందో నన్నదే" అంది వసుధ.

"ఈ ఫిఫ్టీన్ డేస్‌గా రోజుకి నాలుగైదు గంటలు వదిలి ఉంటుంటేనే ఎంతగానో ఏడుస్తున్నదట. అలాంటిది ఇవాళ బాగా లేటయిపోయింది. ఎంత ఏడుస్తోందో - ఏంటో" విచారంగా అంది కావ్య.

"నీ ప్రాణమంతా పాపమీదే ఉంటే ఇక మాతో ఏం వస్తావులే - రాణీ రాగానే ఏదన్నా పిక్చర్‌కి వెడదామనుకున్నాం. కనీసం అదొచ్చేంతవరకైనా ఆగేలా లేవు నువ్వు" అంది కోపంగా రమణి.

అది గమనించి, "అదేం కాదులే - సినిమాకైతే కుదర్దులే గానీ, ఇంకో గంట కూర్చుని వెడతాను. కాలేజ్‌లో గడిపే ఆఖరి రోజు కదా ఇది" అంది కావ్య.


దాంతో మళ్లీ ముగ్గురూ ముచ్చట్లలో మునిగిపోయారు.

"అమ్మయ్య - మీరిక్కడ బైఠాయించారా? మీకోసం అక్కడా ఇక్కడా వెదికి వస్తున్నా - మీరో గుడ్ న్యూస్ చెప్పాలి" అంటూ రొప్పుతూ వచ్చింది రాణి.

"తల్లీ ప్రశాంతంగా కూర్చొని సంగతేంటో చెప్పి ఏడు" అంది వసుధ.

"అలా అంటే ఏం చెప్పను?" బుంగమూతి పెడుతూ అంది రాణి.

"దాని మాటల్ని పట్టించుకోకు గానీ - సంగతేంటో చెప్పవే. ఎవర్నయినా పటాయించి - బుట్టలో వేసావా?" కన్నుగీటుతూ అంది రమణి.





"నాకేం ఖర్మ. వచ్చే నెల్లోనే నా పెళ్లి" అంది రాణి, తన బ్యాగ్‌లో నుండి వెడ్డింగ్ కార్డ్స్ తీసి తలా ఒకటి ఇస్తూ.

"ఓహ్ కంగ్రాచ్యులేషన్స్. మీకు మాట మాత్రంగానైనా చెప్పలేదేంటే" అంది కావ్య.

"అన్నీ కుదిరేదాకా చెప్పొద్దు అన్నారే మా వాళ్లు - ఇదివరకు రెండు - మూడు సంబంధాలు - నిశ్చయ తాంబూలాల వరకూ వచ్చి ఆగిపోయాయ్ - అందుకు".

"సరేలే. పెళ్లికొడుకు ఏం చదివాడు? ఏం చేస్తున్నాడు? నీలాగే ఉంటాడా?" చేతుల్ని బాగా ఎడం చేసి 'లావు'ని సూచిస్తూ అడిగింది వసుధ.



"అవును. మేం మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా ఉంటాం" అంది రాణి.

"పోన్లే - వాడో బక్క పీనుగైతే దీ స్నేం భరించగలడు" అంది వెక్కిరింతగా రమణి.

"ఇదే వాడిని మోయాల్సి వస్తుంది గానీ వాడేం మోస్తాడని" అంది వసుధ.

"ఇదుగో ఇందాకట్నుండీ చూస్తున్నా. వాడూ వీడని అనే బదులు 'ఉడ్‌బీ' అంటే మీ సొమ్మేం పోయిందే?" నొచ్చుకుంటూ అంది రాణి.

"అమ్మో - అప్పుడే అంత ప్రేమ ముంచుకొచ్చిందేంటే?" అంది కావ్య.

"అది సరే గానీ! ఇంతకీ వాణ్ణి సారీ - మీ ఉడ్‌బీని ఎంతకు కొన్నారేంటి?" ఆరా తీస్తూ అంది రమణి.

"ఆ ... అదేం లేదు" అంది రాణి.

"అదేం లేకపోవడం ఏంటి? నీ 'బరువైన అందాలు' చూసి ఏదీ వద్దన్నాడా?" కుతూహలంగా అంది వసుధ.

"ఎందుకూ ఎప్పుడూ నామీద పడి ఏడుస్తావ్. నీలా చెస్ట్ ఉంటే ఎయిర్ పోర్టంటారు తెలుసా" అంది ఉడికిపోతూ రాణి.

"అబ్బబ్బ ఎందుకొచ్చిన పనికిమాలిన మాటలు"అంది విసుగ్గా కావ్య.

"అది కాదే కావ్యా! ఈ వసుధెప్పుడూ నన్ను వెక్కిరిస్తుంది గానీ, తనలోని లోపం ఏంటో దానికి తెలుసు, ఎన్నోసార్లు నాతో చెప్పుకొని ఏడ్చింది - తనకి బ్రెస్ట్ పెరగడానికేం చేయాలో చెప్పమని సలహాలు గూడా అడిగింది తెలుసా! అంది ఉక్రోషంగా రాణి.


"నయం ఫ్రెండేగదాని - తన సమస్యని ఏనాడూ చెప్పకపోవడమే నయమైంది. చెప్పి ఉంటే - అమ్మో" అనుకొంది కావ్య.

"ప్లీజ్ లీవిట్ - ఇప్పటికే లేట్ అయింది - పోదాం పదండి" అంటూ లేచింది కావ్య. మిగిలినవారు ఆమెని అనుసరించారు.

"పిన్ని బడి పూవు వలె మెత్తనమ్మా
ఆదమరిచి హాయిగా నిదురపోమ్మా" అంటూ పాపని నిద్రయిచ్చి, పాప నిద్రపోయిందని నిర్ధారణ చేసికొన్నాక మెల్లగా పరువుమీద పడుకోబెట్టి - వెచ్చగా ఉండేలా దుప్పటికప్పి - పాపకు అటువైపు దిండు అమర్చి, పాపకిటు పక్కగా ఒరిగింది లేత గులాబీలా ఉన్న పాపను హత్తుకుంది.

పాప పుట్టిన నెలకు, "నేనూ - పాపా క్షేమంగా ఉంటే గుడికి వస్తామని మొక్కుకొన్నారట మీ బావ" నేనూ మీ బావా వెళ్లొస్తాం - కాస్త చలిగా ఉంది కదా! పాపని మరోసారి తీసుకెడతాను కాస్త దాన్ని చూస్తూ ఉండు

కావ్యా" అంటూ చెప్పి వెళ్లిన అక్క తిరిగి రాలేదు. స్కూటర్‌ని లారీ గుద్దెయ్యడంతో అక్కడికక్కడే తన అక్కా బావా పోయారు. ఆ షాకింగ్ న్యూస్ విన్న తల్లి గుండె ఆగి మరణించింది. తండ్రి పూర్తిగా డీలా పడిపోయారు. కావ్యే ధైర్యాన్ని కూడదీసుకుంది. పాపకి, తండ్రికి - చెల్లికి, తమ్ముడికి తనే తల్లి అయింది. అన్ని పనులతో




బాధ్యతలతో సతమతమవుతున్నా ఫైనల్ ఇయర్ ఎగ్జామ్స్ రాస్తే డిగ్రీ చేతికొస్తుందని - చదువుమీద దృష్టి కేంద్రీకరించింది. ప్రిపరేషన్ హాలిడేస్ బాగానే దొరకడం వల్ల పాపని కనిపెట్టుకొని ఉంటూనే చదవగలిగింది.

పుట్టిన నెలకే తల్లిదండ్రుల్ని కోల్పోయిన ఆ పసిదాన్ని చూస్తే ఆమె కళ్లలో ఇట్టే నీళ్లు చేరతాయి. కావ్య పంచ ప్రాణాలూ పాపే అయిపోయిందంటే అతిశయోక్తి లేదు. పాపకి ఒళ్లు వెచ్చబడితే చాలు - అంతటి ధైర్యం ఏమయిపోతుందో గానీ ఆరాటపడిపోతుంది. గుక్కపట్టి ఏడిస్తే చాలు అల్లాడిపోతుంది - పాప నవ్వితే పరవశించిపోతుంది. ఏ పని చేస్తున్నా పాపని సాధ్యమైనంతవరకూ ఒడి దించేది కాదు - "మరీ అంత చేరిక చేసుకుంటే ముందు ముందు కష్టమవుతుందేమోనని" తండ్రి, ఇరుగు - పొరుగు చెప్పినా వినిపించుకునేది కాదు. పాపంటే అంతులేని ఆపేక్ష.

పాటలు వినాలనుకొని మెల్లిగా లేచి టేప్ ఆన్ చేసింది. కరెంట్ పోవడంతో నిట్టూర్చింది. ఎగ్జామ్స్ అయిపోవడంతో చాలా రిలాక్స్‌గా ఉంది. అరుదుగా దొరికిన ఖాళీ సమయాన్ని ఏం చేయాలో తెలీక అటూ ఇటూ తిరిగింది. టేబుల్ మీద బావ, అక్కకి ప్రెజెంట్ చేసిన నవల కన్పించింది - అంతగా నవలలు చదివే అలవాటు లేని కావ్య దృష్టి ఎప్పుడూ ఆ నవల మీద పడనే లేదు. ఆ నవల తెచ్చుకొని, పాపకి దగ్గరగా పడుకొని చదువనారంభించింది.

"అతడు ఆమెని మెల్లిగా మంచంవైపు నడిపించాడు.

ఆమె సిగ్గుతో మొహం కప్పుకొంది. చేతుల్ని ఆమె మొహం మీదనుండి తప్పించి గాఢంగా ఆమెని తన హృదయానికి హత్తుకున్నాడు. ఆ గాఢ పరిష్వంగంలో ఆమె పాలిండ్లు అతనికి పూలచెండ్లులా తగిలాయి. అతని చూపు వాటిమీదే నిలిచిపోయింది. మెల్లిగా ఆమె జాకెట్ హుక్స్ తప్పించాడు - బ్రా లోంచి - అతనిలోని మగతనాన్ని సవాల్ చేస్తున్నట్లుగా - పొగరుగా కనిపిస్తోన్న ఆమె వక్షోజాలని చూస్తూ ఉంటే, అతనికి పిచ్చెక్కినట్లయింది. ఒకసారి వాటికి బలంగా తన మొహాన్ని రుద్దుకున్నాడు.

సృష్టి ఎంత విచిత్రం. ఒకప్పుడు ఆ పాలిండ్లే అతడి కడుపుని నింపి మనిషిని చేస్తాయ్. యవ్వనంలో ఆ పాలిండ్లే కాంక్షను రేపి 'మగాడిగా మారుస్తాయ్'.

చదువుతున్న కావ్య ఒక్కసారిగా దడదడలాడే గుండెలతో లేచి కూర్చుంది. 'అయ్య బాబోయ్! ముక్కూ మొహం తెలిని ఓ మగాడు పెళ్లి చేసుకోగానే - అంత చనువుగా ప్రవర్తిస్తాడా? రేపు తనకీ పెళ్లయితే ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తే - అమ్మో!' ఆ ఆలోచనే భరించలేనట్లు తల విదిలించింది.

తన సమస్య గురించి ఎవరికి చెప్పుకోవటం? తల్లి లేదు. తండ్రికి చెప్పుకొనే సమస్య కాదు. ఫ్రెండ్స్‌కి చెప్పాలన్నా భయమే. ఏ మాగజైన్‌కన్నా రాద్దామంటే - ఆ ప్రశ్న ఎప్పుడు ప్రచురితమవుతుందో దానికి జవాబేమని ఇస్తారో? ఎన్ని పత్రికలని కొనడం - రాసినా తన సమస్యకి జవాబు ఉంటుందో లేదో - అసలు తన సమస్య మరొకరికెవరికన్నా ఇంతవరకూ వచ్చిందో - లేదో? ఆ డౌట్ రాగానే అప్పుడప్పుడు అక్కకోసం బావతెచ్చిన మాగజైన్ - మరికొన్ని పక్కింటి వారినడిగి తెచ్చినవి ముందేసుకొని కూర్చుంది - ఆమె ఊహించినట్లు ఆమెకున్న సమస్య మరెవరికీ రాలేదేమో, అది కన్పించనే లేదు. పైగా కొందరి ఇతర రకరకాల సమస్యలు తెలిసి, మనసు మరింత కల్లోలానికి లోనయింది. 'భగవంతుడా! నా సమస్యకు పరిష్కారం ఏంటి?' అని అంటూ బాధ పడటమే కావ్య వంతయింది.

***

"కావ్యా! అబ్బాయి బుద్ధిమంతుడు. వెనుకా ముందూ ఎవరూ లేరు. నువ్వు ఎంతో అదృష్టవంతురాలివమ్మా. మంచి సంబంధం కుదిరింది. వచ్చేనెల్లో మంచి ముహూర్తాలున్నాయట! అవి దాటితే మంచిరోజులు లేవు. ఫోటో చూడు. నేను బాగా వాకబు చేసాను - అబ్బాయి గురించి ఆలోచించాల్సిందేమీ లేదు. ఆ అబ్బాయి నీ ఫోటో చూసి నచ్చావన్నాడు. అయినప్పటికీ పెళ్లి చూపులకు రమ్మని చెప్పాను. ఇక పెళ్లిచూపుల్లోనే ఏకంగా నిశ్చితార్థం చేయాలనుకొంటున్నాం" అన్నాడు రంగనాథరావ్.

అతని మాటలకు అడ్డొస్తూ "నాన్నగారూ! నేను పెళ్లి చేసుకొని వెళ్లిపోతే పాప ఎలా? మీ అందర్నీ ఎవరు చూస్తారు? నేను లేకుంటే పాప క్షణమయినా ఉండలేదు. కనీసం పాపకు మూడేళ్లు వచ్చేవరకైనా... ఆదేం కుదరదమ్మా! ఆ అబ్బాయి తల్లి ఈ మధ్యే పోయిందట - హోటల్ భోజనం పడటం లేదట - ఎంత త్వరగా వీలు అయితే అంత తొందరగా పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాడు. మనం కాదంటే ఎగరేసుకోవడానికి బోలెడంతమంది ఎదురు చూస్తున్నారు. ఆ అన్ని సంబంధాల్లోకి నీ ఫోటో నచ్చడంతో ఇటే మొగ్గు చూపిస్తున్నాడు. ఇక మనింటి సంగతా - మా చిన్నమ్మ - అదే మీ చిన్న నాన్నమ్మని పంపిస్తున్నాను. ఆమైతే మా అందర్నీ కనిపెట్టుకొని ఉంటుంది." అన్నాడాయన ఖచ్చితంగా.

తండ్రి దగ్గర చనువు లేదు పైగా భయం - అందుకే మౌనంగా తలూపింది. దాంతో ఆ మరుసటి నెల, మొదటివారంలోనే కావ్య పెళ్లి శ్రీనాథ్‌తో జరిగిపోయింది. పెళ్లయిన రెండో రోజు రాత్రికే శోభనం నిర్ణయించారు పెద్దలు. దాంతో ఆ క్షణంనుండే కావ్యలో అలజడి మొదలైంది. చేతుల్లో చెమటలు గుండెలో దడదడ. పైనుండి స్నేహితురాళ్లు ఆటపట్టించడం, 'తన సమస్య అతడికి తెలిసిన మరుక్షణం ఈ గుండె ఆగిపోతుంది' అనుకోసాగింది.

'కావ్య ఈ కాలపు పిల్లకాదు - ఎంతలా భయపడిపోతోందో చూడండి. ఏయ్ పిల్లలూ - కావ్యనల్లరి చేయడం మానండి' అంటూ ముత్తయిదువులు చెబుతోన్నా స్నేహితురాళ్లు

ఆమెను గదిలోకి పంపుతూ "ఏమేం జరిగింది రేపొద్దున పూసగుచ్చినట్లు చెప్పాలి" అంటూంటే కావ్యకి 'ఎలకకి ప్రాణసంకటం - పిల్లికి చెలగాటం' అన్న సామెత మొదటిసారిగా అనుభవంలోకి వచ్చింది.

బొమ్మలా, గుమ్మం దగ్గరే నిలబడిపోయిన కావ్య దగ్గరకు వచ్చాడు శ్రీనాథ్. అతను వేసే ప్రతి అడుగూ, తన గుండెల మీద పడ్డట్లే వణికిపోసాగింది కావ్య. మొహం నిండా ముత్యాల్లా స్వేదబిందువులు అలుముకోసాగాయ్. వణుకుతున్న ఆమె తనువును చూస్తూ "ఏంటి? అంతలా భయపడుతున్నావ్! నేను రాక్షసుడిలా కన్పిస్తున్నానా?" అడిగాడు శ్రీనాథ్ మెల్లిగా ఆమె చేతిని అందుకుంటూ. తత్తరపడుతూ, చివాల్న చేతిని లాగేసుకుంది కావ్య. దాంతో ఆమె భుజాల చుట్టూ చేతులేసి మెల్లగా ఆమెని మంచం దగ్గరకు తీసుకొచ్చాడు శ్రీనాథ్. ఫ్యాన్ గాలి ఆమెకి బాగా తగిలేలా ఏర్పాటు చేశాడు.

"ఆ పాలగ్లాసులోని పాలన్నీ నేలపాలయ్యేలా ఉన్నాయ్? నీ వణుకుతో - పాలనిచ్చేదుందా - లేదా?" అన్నాడు కొంటెగా.

కంగారుగా, ఆ గ్లాస్‌ని చటుక్కున అతని చేతికందించేసింది.

"ఈపాలని - ముద్దు మురిపాలని మనం పంచుకోవాలి." అంటూ సగం పాలని తాగి మిగిలినవి ఆమె కందించాడు. ఆ గ్లాస్‌నలాగే పట్టుకొని తల వాల్చుకొని కూర్చుంది కావ్య, అందం, వినయం, లావణ్యం మూర్తీభవించినట్లు కూర్చున్న కావ్యని చూస్తుంటే అతనికి ఎంతో ముచ్చటేసింది.

"ఇక నుండీ ఈమె నా స్వంతం - ఈ అందాలన్నీ నా స్వంతం" అనుకొనేసరికి అతనికెంతో గర్వం కలిగింది.

"బాగా ఉక్కపోతగా ఉన్నట్లుంది - కాస్త పైటని తీయరాదూ" అంటూ భుజం మీద చేయి వేయబోయాడు.

"వద్దొద్దు." అంది ఏడ్పు - కంగారు ధ్వనిస్తున్న గొంతుతో.

ఆమెది సిగ్గు కాదని - ఎందుకో విపరీతంగా భయపడుతుందని అతనికి అర్థమయింది. అదేంటో తెలుసుకొని - ముందు ఆ భయాన్నే పోగొట్టాలి అనుకొంటూ ఆమెకి కాస్త దూరంగా జరిగాడు.

"కావ్యా! ప్లీజ్ అలా భయపొద్దు. మనం మంచి స్నేహితుల్లా కాస్సేపు మనసు విప్పి మాట్లాడుకుందాం. సరేనా" అన్నాడు.

ఒకటో తరగతిలో మొదటిరోజునే కూర్చొని భయంగా తలూపే చిన్నపిల్లలా వెంటనే తల ఆడించింది కావ్య.

"నీకెవరంటే చాలా ఇష్టం - టక్కున చెప్పేయ్యాలి" అన్నాడు మొదటగా.

"మా పాప" టక్కున చెప్పింది.

"ఓహో అలాగా - మీ అక్కగారి అమ్మాయి నీ దగ్గరే పెరుగుతుందన్నారు - ఆ పాపేనా?"

అవునన్నట్లు తలూపింది.

"ఇంకా ఎవరెవరిష్టం?"

అర్థం కానట్లు చూసింది కావ్య తలపైకెత్తి.


"అబ్బ - ఎంత పెద్ద కళ్లో - ఆవుకళ్లలా నల్లగా - నిర్మలంగా" అని ముచ్చటపడే మనసు నోరు నొక్కేస్తూ -

"అదే! మీ ఇంట్లో ఇంకా ఎవరెవరిష్టం? అష్టపడే హీరో హీరోయిన్లెవరు? ఏ రచయితల నవలలంటే ఇష్టం? లేదూ ఏ ఆటగాడంటే ఇష్టం?" అలా...

"మా ఇంట్లో అందరూ ఇష్టమే. అందరికన్నా పాప ఇష్టం" అంది గభాల్న.


ఆరోగ్యవంతమైన మూత్రపిండాలు (కిడ్నీలు) మీకు ఎంతో అవసరం!
కిడ్నీ పాడైపోవడానికి కారణాలు ?
షుగర్ వ్యాధి (డయాబెటీస్)
క్రిములు (ఇన్‌ఫెక్షన్స్)
ఇది ఎంత ప్రమాదకరం ?
డయాలిసిస్ / ... అవసరం
చికిత్స పొందకపోతే .../ మరణం
వీటిని అరికట్టేందుకు మార్గాలు ఏమిటి?
డయాబెటీస్, రక్తపోటు అదుపు చేసుకోవడం
ఆహారంలో మార్పులు
నెఫ్రాలజిస్టు / యూరాలజిస్టును ...

అయితే ! తక్షణమే నెఫ్రాలజిస్టు / యూరాలజిస్టును సంప్రదించండి!
EMERGENCY 24 SERVICE
ఎన్నో ప్రత్యేకతలు కలిగినది గ్లోబల్ హాస్పిటల్
- అత్యున్నత శిక్షణపొందిన నెఫ్రాలజిస్టులు / యూరాలజిస్టులు
- హిమోడయాలిసిస్ మరియు సి.ఎ.పి.డి. సౌకర్యాలు
- కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు అనువైన సదుపాయాలు
- టి.యు. ఆర్.పి.సి.ఎన్.ఎల్, యు.ఆర్.ఎస్. ఎల్ లాంటి అన్నిరకాల యూరాలజీ శస్త్రచికిత్సలు చేసే సదుపాయం అందుబాటు.
కిడ్నీ చెకప్‌లో చేసే పరీక్షలు
- యూరియా, క్రియాటినిన్, బ్లడ్ షుగర్ పరీక్షలు
- సీరం ఎలక్ట్రోలైట్స్, పూర్తి రక్త పరీక్ష (సిబిపి)
- మూత్ర పరీక్ష (మైక్రోస్కోపిక్)
- అబ్డోమినల్ అల్ట్రాసౌండ్
- నెఫ్రాలజిస్టు / యూరాలజిస్టుతో సంప్రదింపులు
EXCELLENCE THROUGH TEAM WORK
సంప్రదించండి ఫోన్ : 23234567
గుర్తింపు:
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎ.పి. ట్రాన్స్‌కో, ఎఫ్.సి.ఐ
ఎ.పి.జెన్ కో, సి.పి.డి.సి.ఎల్ బి.డి.ఎల్, ఎన్.ఎం.డి.సి
గ్లోబల్ హాస్పిటల్స్
సి.జి.హెచ్.ఎస్, ఆరోగ్య భద్రత, దక్షిణమధ్య రైల్వే,
ఎన్.టి.పి.సి, సింగరేణి కాలరీస్ మరెన్నో ప్రముఖ సంస్థలు
లకడీకాపూల్, హైదరాబాద్ - 500 004 ఫోన్: 040 - 23244444 (10 లైన్లు) ఫ్యాక్స్ : 23244455 వెబ్ సైట్: www.theglobalhospital.com
TIME & SPACE




"మరి నేనడిగిన..."

"నేను సినిమాలు చూడను. నవలలూ చదవను - ఆటలు చూడను" అంది చప్పున.

రాముడు మంచి బాలుడిలా - ఈ కావ్య "అతి మంచి బాలిక" అనుకునేసరికి శ్రీనాథ్‌కి నవ్వొచ్చింది. నవ్వితే ఉడుక్కొనే పసిపిల్ల మెంటాలిటీ ఉన్నట్లుందనుకొంటూ -

"మరి పాప ఏదీ కనిపించలేదే" అడిగాడు.

"పాపని - వాళ్ల నాన్నమ్మ దగ్గరకు పంపేసారు - పెళ్లని - పనులున్నాయని - నాకు ఈవారం నుండీ దూరం చేసేశారు" అంది ఈసారి ఇక ఏడ్పుని దాచే ప్రయత్నం చేయకుండా - వెక్కెక్కి ఏడుస్తూ..

"ఛ... ఛ... చిన్నపిల్లలా? ఆ ఏడ్పేంటి - ముందు ఏడవడం ఆపేసేయ్ - మనం వెళ్లి పాపని తీసుకొద్దాంలే".

"సరే." అంటూ సంబరంగా అనబోయి, వెంటనే ఏదో గుర్తొచ్చి "ఊహు. నాన్నగారు ఒప్పుకోరు" అంది కావ్య దిగులుగా.

"నేను ఒప్పిస్తాలే" అన్నాడు శ్రీనాథ్.

"ఊహు - వద్దు. వద్దొద్దు" భయంగా అంది కావ్య.

"పాపంటే ప్రాణమంటుంది. తెస్తానంటే వద్దంటుంది. ఉలిక్కిపడుతుంది" అనుకున్నాడు. అలసట, భయం మొహం నిండా ఉన్న కావ్యని చూస్తూ, ముందుకి అడుగెయ్యలేకపోయాడు శ్రీనాథ్.

ఆ రాత్రే కాదు - మూడురాత్రులు గడిచినా, శ్రీనాథ్‌ని తన చెంతకి చేరనివ్వలేదు కావ్య.

తమ ఇంటికి వెళ్లాక - దొరికిన ప్రైవసీతో మారుతుందేమో ననుకొంటూ - ఆ రాత్రే ప్రయాణమయ్యాడు.

ఇల్లు చూసి ముచ్చటపడింది కావ్య. అతను ఆఫీసుకి వెళ్లేవరకూ అతన్నంటి పెట్టుకొని అన్నీ అమర్చేది - అతని పట్ల గౌరవాభిమానాలు చూపించేది. దాంతో "ఆమెకి తనంటే అయిష్టం లేదని స్పష్టంగా తెలుస్తోంది. రుచికరంగా వండి పెడుతోంది. చేస్తున్న ప్రతి పని పట్లా శ్రద్ధ చూపిస్తుంది. తనకి మొన్న దెబ్బ తగిలితే, ఆమెకే తగిలినంత బాధ పడింది. తలనొప్పితో బాధపడుతుంటే - ఆ రోజంతా తన దగ్గరే కూర్చుంది. అమృతాంజనంని మర్దనా చేస్తూ. అంతా ఓకేనే గానీ మరి చెయ్యి మాత్రం వేయనీయటం లేదు. అదంతా భయమేనా? ఊహూ... కాదు ఏంటో ఎలా తెలుసుకోవడం?" ఆలోచనల్లోనే - వారం రోజులిట్టే గడిచాయ్.

"పోనీ. కాలేజీ రోజుల్లో ఎవర్నయినా ప్రేమించిందా? ఊహూ. అటువంటి చొరవ ఉన్న మనిషి కాదు. పొద్దుటంతా నువ్వే ప్రాణమన్నట్లు మసలుతూ - రాత్రయ్యేసరికి "టచ్ మీ నాట్" లా ముడుచుకుపోతోందేంటి? కారణం ఎలా తెలుసుకోవడం అంటూ తీవ్రంగా ఆలోచిస్తున్న అతనికి, ఆమె రోజూ రాసే డైరీ స్ఫురించింది.

"ఇతరుల డైరీ చదవటం సంస్కారం కాదు - కానీ భార్య డైరీ - అందులోనూ రీజనేంటో తెలుసుకోవడానికి చదివితే తప్పేం లేదని మనసుకి నచ్చచెప్పుకొని - ఆ రాత్రి ఆమె నిద్రపోయాక, టేబుల్ ల్యాంప్ వెలుగులో కావ్య డైరీ చదవసాగాడు శ్రీనాథ్.

"ఇవాళ క్లాస్‌లో అందరూ తమ తమ ప్రాబ్లెమ్స్ గురించి - నిస్సంకోచంగా చెప్పుకున్నారు - నేనే పెదవి విప్పలేకపోయాను."

మరో పేజీ తిప్పాడు.

"ఇవ్వాళ పాప గుక్కపెట్టి ఏడుస్తూంటే చూడలేక ఏడుపునాపుతుందని ... ఆ పని చేసానే గానీ చాలా భయం వేసింది.

"ఎంత వద్దంటున్నా నాన్నగారు వినడం లేదు. పెళ్లికి ముహూర్తం పెట్టించేశారు. పాప నాకు దూరం అయిపోతోంది. ఏ పాపం చేశానని ఇంత శిక్ష వేశావు?"

ఇంకో పేజీలో "పెళ్లి దగ్గరపడుతున్న కొద్దీ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయ్. పాపని నా నుండి వేరుచేసింది నాన్నగారు ఆ రాబోయే వరుడే - నేనే నచ్చానుట. నన్నే పెళ్లాడతాడట - నాలోని లోపం తెలిశాక ఆయనగారి మొహం ఎలా ఉంటుందో? పాపం ఆయన తప్పేం ఉందిలే? దేవుడే ఇంత నాటకం ఆడిస్తూంటే - తల్లినుండి పాపని దూరమెందుకు చేయాలి - ఆ తల్లి స్తన్యం నుండి రావలసిన పాలనెందుకు నా ద్వారా పాపకి అందజేయాలి? పెళ్లయ్యాక పాపని తెచ్చుకోవడానికి అతడు అంగీకరించినా - నేను పాలిస్తుంటే చూసి భరించగలుగుతాడా?"

"ఈరోజు పెళ్లయింది. ఆయన చేతులు నా మెడకు తగిలిన తొలిస్పర్శకి ఒళ్లంతా గిలిగింతలు రేగింది. మనిషి నిదానస్థుడిలా - మంచోడిలా కనిపిస్తున్నాడు".

"నన్ను దొంగచాటుగా ఆయన చూస్తుండటం - నన్ను ఒంటరిగా దొరికించుకోవాలని రకరకాల ప్లానులు వేయడం మనసుకెందుకో ఓ పక్క ఆనందాన్నే కలిగిస్తున్నా తొలిరేయిని ఎలా ఫేస్ చేయాలో తల్చుకుంటూంటే మాత్రం ఒణుకుపుట్టుకొస్తోంది."

"ఇవ్వాళ మా మొదటిరాత్రి. ప్రతీ కన్నెపిల్ల ఎన్నో కోరికలతో మొదలుపెట్టే ఈ రాత్రిని నా భయం వల్ల చప్పగా తెల్లారేటట్లు చేసుకున్నాను. పాపం చాలా డిస్సప్పాయింట్ అయ్యారు. కానీ ఏమీ బలవంతపెట్టకుండా అటుతిరిగి పడుకున్నారు. ఏ రాత్రి ఆయన లేస్తాడోనని చూస్తూ కూర్చుండిపోయాను. మనిషి ఎంచ అందగాడో, అంత మంచివాడు - లేకుంటే అలా సహకరించగల్గుతాడా? అతని స్పర్శించిన ఆ చిరుస్పర్శలకే ఒళ్లంతా పులకరింతలొచ్చాయ్. ఆ పులకరింతలతో స్థనాల్లోకి పాలొచ్చేశాయ్. పాప ఏడుస్తూంటే, అనాలోచితంగా, కన్నతల్లిలా పాపకి రొమ్ము అందించడమేంటి? తల్లి అయితేనే పాలు పడతాయంటారు - మరి నాకు పాలుపడటం ఏంటి? ఈ విడ్డూరం ఎక్కడన్నా ఉందా? చెప్పినా నమ్ముతారా? ఆయనకి చెప్పకుండా ఎన్ని రోజులని నెట్టుకురాగలను? చెబితే నాకు ఎవరితోనయినా ఇంతకుముందే సంబంధం ఉందని వదిలేస్తేనో?

వదిలేస్తే వదిలెయ్యని - పాపని పెంచుతూ

ఈ జీవితాన్ని గడిపేస్తాను. ఈ నరకయాతన పడలేను. పాపని చూడకుండా ఉండలేకపోతున్నాను. ఇవాళో, రేపో సంగతంతా చెప్పేస్తాను. 'పాలముంచినా - నీటముంచినా ఆయన్దే భారం.'

అది అంతకు ముందురోజు రాసిన పేజీలో ఉంది. అంటే ఇవాళో - రేపో తనతో అన్నీ చెప్పాలనుకొంది కాబోలు. పాపం మళ్లీ భయంతో కాబోలు పెదవి విప్పలేదు. పిచ్చిది ఎంత టెన్షన్ పడుతోంది - అనుకొంటూ - అమాయకంగా నిద్రపోతున్న కావ్య కళ్లమీద సుతారంగా చుంబించాడు శ్రీనాథ్.

మరుసటిరోజు డాక్టరైన తన కజిన్ దగ్గరకు వెళ్లి - వివరాలన్నీ తెలుసుకున్నాడు. ఆ వివరాలన్నీ పేపర్ మీద రాసుకున్నాడు.

ఆ మర్నాడు ఆఫీసుకు వెళ్లేముందు - ఆ పేపర్లని కావ్య కంటపడేలా డ్రెస్సింగ్ టేబుల్ మీద ఉంచి వెళ్లాడు. అతడు వెళ్లాక ఇల్లంతా సర్దుతున్న కావ్య యథాలాపంగా ఆ పేపర్లని అందుకొని - హెడ్డింగ్ చూస్తూనే అదిరిపడింది. వణుకుతున్న గుండెలతో, గబగబా ఆ రాతలపై తన చూపులని సారించింది.

"గర్భం వస్తేనే పాలిండ్లలో పాలు ఉత్పత్తి అవుతాయా?"

కానుపు అయితే తప్ప పాల ఉత్పత్తి ఉండదని, కన్యలో పాలుకారడం అసంభవం అని అనుకొంటారు. కానీ కొందరిలో ఎటువంటి సెక్సు సంబంధం లేకుండానే గర్భం రాకుండానే పాలిండ్లనుండి పాలుకారడం జరుగుతుంది. ఈ అసాధారణ పరిస్థితినే 'గాలక్టోరియా' అంటారు.

ఇక కొందరు స్త్రీలకు డెలివరి జరిగి ఎంతో కాలమై, పిల్లలు పెద్దవాళ్లయి పోయాక, అనుకోకుండా పాలురావడం మొదలవుతుంది. అలా ఏదో ఒకరోజు ఒకప్పుడు కాకుండా, రోజుల తరబడి పాలిండ్లనుండి పాలు స్రవిస్తాయి. "గాలక్టోరియా"కి మెదడులో ఉండే హైపోథలమస్ - పిట్యూటరీల పనితీరులో కొంత తేడా రావడం కారణం. అంతేకాకుండా ప్రొలాక్టిన్ అధికంగా ఉత్పత్తిత కావడం మరో కారణం.

పాలు స్రవించడం విషయంలో - పాల ఉత్పత్తి మనసు ప్రభావం చాలా ఉంటుంది. పిల్లలు కావాలని తహతహలాడే కొందరు స్త్రీలలో పాలిండ్లు బరువెక్కిపోవడం, పాలు స్రవించడం అక్కడక్కడా కనబడే సంఘటనలే.

యుక్తవయసు వచ్చిన ఆడపిల్లలుగానీ, వృద్ధాప్యం వచ్చిన స్త్రీలుగానీ ఆపేక్షతో చంటిబిడ్డకు రొమ్ము అందిస్తే కొద్ది రోజుల్లోనే పాలతో పాలిండ్లు నిండిపోయిన సంఘటనలు లేకపోలేదు. దీనికంతటికీ "ఎమోషనల్ ఫ్యాక్టర్స్" మూలం. సీరం ప్రోలాక్టిన్ ఎక్కువగా ఉన్న పురుషుల రొమ్ములనుండి కూడా పాలుకారడం జరుగుతుంది. ఇంకా కుటుంబ నియంత్రణ కోసం వాడే గర్భనిరోధక మాత్రలవల్ల, ట్రాంక్విలైజర్స్ వల్ల గర్భం రాకపోయినా కొందరిలో రొమ్ములు బరువెక్కి కొద్దో - గొప్పో పాలు కారడం జరుగుతుంది.

నివారణ:

కాన్పుతో సంబంధం లేకుండా పాలిండ్లనుండి పాలు వస్తున్నప్పుడు మూలకారణాన్ని పరిశీలించాలి. గర్భ నిరోధక మాత్రలు - ట్రాంక్విలైజర్స్ వల్ల - అయితే వాటిని ఆపి - మరొకటి వాడాలి. హైపోథలమస్ - పిట్యూటరీకి సంబంధించిన పరిస్థితి ఉంటే దానికి తగిన చికిత్స చేయాలి. మామూలుగా కలిగే గాలక్టోరియాకి 'క్లోమిఫిల్' టాబ్లెట్లు వాడితే తగ్గిపోతుంది. ఆ పేపర్‌ని మడిచిపెడుతుండగా, దాని వెనుక "కావ్యా! సారీ! నీ పర్మిషన్ లేకుండా డైరీ చదవవలసి వచ్చింది. నువ్వు నానుండి, ఇక మీదట ఏ సీక్రెట్స్ దాయకు. చూడు - అనవసరంగా పదిరోజుల్ని జారవిడుచుకున్నాం. నువ్వొప్పుకుంటే రేపే డాక్టర్ దగ్గరకు తీసుకువెళతాను. ఓకే - విత్ లాట్ ఆఫ్ లక్ -

నీ శ్రీనాథ్.

అదంతా చదివేసరికి కావ్య బుగ్గల్లోకి వెచ్చటి ఆవిర్లొచ్చేశాయ్. సమస్య ఇంత తేలిగ్గా 'హుష్ కాకీ' అయిపోగానే, మనసంతా దూదిపింజెంలా మారింది. సంతోషంతో శరీరంలోని ప్రతీ అవయవం ఉప్పొంగసాగింది. ఆనందాశయాలతో కాలు ఒక్కచోట నిలవడం లేదు. ఆ సాయంత్రంత తొందరగా తయారై మార్కెట్‌కి వెళ్లి గంపెడు మల్లె పూలు తెచ్చింది. చక్కగా పందిరి మంచాన్ని శ్రద్ధగా అలంకరించింది. పాల వెన్నెల్లాంటి తెల్లని చీర కట్టుకొంది - తలనిండా మల్లెచెండు తురుముకొంది.

ఇక నిముషానికో - ఘడియకో శ్రీనాథ్ వస్తాడనుకొంటే మనసునిండా ఉద్వేగం - తలుపు చప్పుడు కోసం చెవులనప్పగించింది. మనసులో తిలక్ కవిత్వం - ఎప్పుడో చదివింది - మెదలసాగింది.

"నా వొంటి నిగనిగల శయ్యను సజ్జితం చేశాను

నా కంటి మిలమిలలు మధువు పాత్రను నింపాను.

త్వరమాణమై ప్రభూ - నా

తనువు స్వీయ యౌవన భారాన తడబడిపోతున్నది.

తలుపు చప్పుడు కాగానే తెరిచి పక్కకు తప్పుకొంది. కాళ్లూ చేతులు కడుక్కోగానే బెడ్ రూమ్‌లోని మంచంపై వాలడం శ్రీనాథ్ అలవాటు. అలాగే బెడ్‌రూమ్‌లోకి వెళ్లిన శ్రీనాథ్‌కి తొలిరేయి మంచాన్ని గుర్తుచేస్తూ అలంకరించిన మంచం, పక్కనే అభిసారికలా తయారైన కావ్య కనిపించగానే అతన్లో రక్తం వడివడిగా పరుగులెత్తింది - మగసిరి ఒక్కసారిగా ఎగిసిపడింది. కావ్యని తన చేతుల్లోకి తీసుకొని, మంచం మీద చేర్చాడు. 'అయ్యో! తలుపులు తెరిచే ఉన్నాయ్' అని కావ్య అంటుంటే మరేం మాట్లాడనీయకుండా ఆమె పెదవులను - తన పెదవులతో కప్పేశాడు - ముద్దు మురిపాలలో మునిగిపోయారు.

ఇక జరగబోయేది మాకు తెలుసులే అనుకొంటూ గదిలోని పిచ్చుకల జంట బయటకు తుర్రుమన్నది.

